



విద్యాలక్ష్మిగా కనకమహాలక్ష్మి

విశాఖలోని బురుజుపేటలో గల శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు బుధవారం విద్యాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
-విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి



మాట్లాడుతున్న ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ

లంబసింగి పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

హరిత రిసార్ట్స్‌లో అదనపు గదుల నిర్మాణానికి చర్యలు

ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ

చింతపల్లి, అక్టోబరు 9: ఆంధ్ర కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగి పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్టు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్(ఏపీటీడీసీ) నూకసాని బాలాజీ తెలిపారు. బుధవారం మండలంలోని లంబసింగి హరిత రిసార్ట్స్, చెరువులవేనం వ్యూపాయింట్, తాజంగి జలాశయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబసింగికి ప్రతి ఏటా సందర్శకుల సంఖ్య భారీగా పెరుగుతున్నదన్నారు. ఈ నేపథ్యంలో లంబసింగి పర్యాటకాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రధానంగా పర్యాటకులు బస చేసేందుకు లంబసింగిలో ఏపీటీడీసీ హరిత రిసార్ట్స్‌లో అదనపు గదులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అదనపు రిసార్ట్స్ నిర్మించేందుకు అవసరమైన నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రిసార్ట్స్ వద్ద పర్యాటకులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. హరిత రిసార్ట్స్ వద్ద రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నామన్నారు. చెరువులవేనం వ్యూపాయింట్, బోడకొండమ్మ జలపాతం, తాజంగి జలాశయంలోనూ పర్యాటకశాఖ సందర్శకుల కోసం మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. లంబసింగికి ఏడాది పొడవున పర్యాటకులు వచ్చే విధంగా సందర్శక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. లంబసింగిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం అందుబాటులోకి వస్తే లంబసింగికి ప్రత్యేక శోభ సంతరించుకుంటుందన్నారు. భవిష్యత్తులో లంబసింగి సందర్శించే పర్యాటకుల సంఖ్య రెట్టింపు అవుతుం దన్నారు. ఆయన వెంట పర్యాటకశాఖ మేనేజర్ సూరిరెడ్డి అప్పలనాయుడు ఉన్నారు.

మద్యం దుకాణాలకు మహా గిరాకీ

జిల్లాలో మొత్తం షాపులు 40
ఇప్పటి వరకు అందిన దరఖాస్తులు 600 పై మాటే..

- పావులు కదుపుతున్న సిండికేట్లు
- చింతూరు పరిధిలో పోటీ పడుతున్న తెలంగాణ వాసులు
- ముంచంగిపుట్టులో ఒక్క దుకాణానికి 30 దరఖాస్తులు
- దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 11 వరకు పొడిగింపు
- మరింత పోటీ ఉండే అవకాశం





పాడేరులో మద్యం దుకాణానికి దరఖాస్తు స్వీకరిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది. (ఇన్‌సెట్లో) పాడేరులో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

గిరిజన ప్రాంతంలోనూ మద్యం దుకాణాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో వాటిని దక్కించుకునేందుకు సిండికేట్లు జోరుగా పావులు కదుపుతూ తమ మద్దతుదారులతో దరఖాస్తులు చేయిస్తున్నాయి. దీంతో జిల్లాలోని మొత్తం 40 మద్యం దుకాణాలకు 600 పైబడి దరఖాస్తులు అందాయి. మరో రెండు రోజులు అంటే ఈ నెల 11వ తేదీ వరకు గడువు పెంచడంతో మరో 50 వరకు దరఖాస్తులు అందే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

జిల్లాలోని పాడేరులో 10, అరకులోయలో 6, చింతపల్లిలో 6, రంపచోడవరంలో 10, చింతూరులో 8.. ఇలా ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 40 మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. కాగా జిల్లాలోని చింతూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో అక్కడ 4 మండలాల్లోని 8 దుకాణాలకు బుధవారం నాటికి 230 దరఖాస్తులు అందాయి. ప్రధానంగా చింతూరు ప్రాంతం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడంతో పాటు పర్యాటకుల తాకిడి సైతం అధికంగానే ఉంటుంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌తో కలిసి నాలుగు రాష్ట్రాలకు చెందిన జాతీయ రహదారులు చేరువలో ఉండడంతో రాకపోకలు అధికంగానే ఉంటాయి. చింతూరు పరిధిలోని మద్యం దుకాణాల కోసం తెలంగాణ రాష్ట్రానికి చెందిన వాళ్లే ఎక్కువగా పోటీ పడుతున్నారు. దీంతో సగటున ఒక్కో దుకాణానికి 30 దరఖాస్తులు అందాయి. ఖమ్మం, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో స్థిరపడిన వాళ్లు ఆంధ్రాలో మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు.

ముంచంగిపుట్టులో ఒక్క దుకాణానికి 28 దరఖాస్తులు

ఊహించని విధంగా ఒడిశాను ఆనుకుని ఉన్న ... మిగతా 6వ పేజీలో

గిరిజన ప్రాంతంలో బార్లకు అనుమతుల్లేవు

విశాఖపట్నం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మహేశ్



మాట్లాడుతున్న విశాఖపట్నం ఎక్సైజ్ ఏసీ మహేశ్, పక్కన ఇన్‌చార్జి సీఐ రాజారావు

పాడేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో బార్లకు ఎటువంటి అనుమతులు లేవని, కేవలం మద్యం దుకాణాలకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇస్తుందని విశాఖపట్నం ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేశ్ తెలిపారు. జిల్లాలోని మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించేందుకు బుధవారం ఇక్కడికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పాడేరు, అరకులోయ, చింతపల్లి, రంపచోడవరం, చింతూరు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 40 మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. మంగళవారం నాటికి 591 దరఖాస్తులు అందాయన్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తున్నామని, దరఖాస్తుదారులు ఇస్తున్న డీడీ, కుల ధ్రువీకరణ పత్రం, ఇతర వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. దరఖాస్తుదారుడు ఇచ్చిన ఎస్టీ కుల ధ్రువపత్రాన్ని రెవెన్యూ సిబ్బంది, డీడీని బ్యాంకు సిబ్బంది పరిశీలిస్తున్నారన్నారు. జిల్లాలో చింతూరు స్టేషన్ పరిధిలో అధికంగా దరఖాస్తులు వస్తున్నాయన్నారు. జి.మాడుగుల, పెదబయలు ప్రాంతాల్లో తక్కువగా దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 11 వరకు పెంచడంతో ఆయా ప్రాంతాల నుంచి దరఖాస్తులు వస్తాయని ఆశిస్తున్నామన్నారు. ముంచంగిపుట్టులోని ఒక దుకాణానికి 28 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 14న పాడేరులో కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో వైన్‌షాప్‌ల కేటాయింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆయన వెంట స్థానిక ఇన్‌చార్జి సీఐ రాజారావు ఉన్నారు.



పాడేరులో వర్షం

మన్యంలో అకాల వర్షం

వాతావరణంలో మార్పే కారణం

పాడేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అధిక వేడి నేపథ్యంలో వాతావరణంలో మార్పు సంభవించి ఏజెన్సీలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. తాజా వర్షానికి జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. గత కొన్ని రోజులుగా ఏజెన్సీలో శీతాకాల వాతావరణం కొనసాగుతున్నప్పటికీ అప్పుడప్పుడు వర్షం కురుస్తున్నది. అలాగే బుధవారం జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని పలు మండలాల్లోనూ ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా వ్యాప్తంగా తీవ్రమైన ఎండ కాసింది. ఆ తరువాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షం మొదలైంది. ప్రస్తుత వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండకాస్తూ ఆ తరువాత వర్షం కురవడంతో పిల్లలు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు రావడంతో పాటు జన జీవనానికి అంతరాయం ఏర్పడుతున్నదని పలువురు ఆందోళన చెందుతున్నారు.

గిరిజన రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపట్టాలి

- రైతు ఉత్పత్తుల విక్రయాలకు డిజిటల్ తూనిక యంత్రాలను ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్
- ఈ ఏడాది 2 వేల టన్నుల కాఫీ పండ్ల సేకరణ లక్ష్యం: ఐటీడీఏ పీవో



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన ఐటీడీఏ పీవో వి.అభిషేక్

పాడేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులను ప్రోత్సహించడంలో భాగంగా వారికి బ్యాంకు లింకేజీ కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో ఉద్యానవన పంటలపై కలెక్టరేట్ నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు అందించాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలో రంపచోడవరం డివిజన్ పరిధిలో 34 వేల మంది రైతులు 64 వేల ఎకరాల్లో జీడి తోటలు, 3,180 ఎకరాల్లో జాఫ్రా, 3 వేల మంది రబ్బరు చెట్లు పెంచుతున్నారు. ఆయా రైతులతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. రైతు ఉత్పత్తుల విక్రయాలకు డిజిటల్ తూనిక యంత్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గిరిజన రైతులు నాణ్యమైన కాఫీ పండ్లు సేకరించేలా లైజన్ వర్కర్ల ద్వారా అవగాహన కల్పించాలని, పామాయిల్ సాగుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా ఉద్యానవనాధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని కాఫీ, ఉద్యానవన తోటలు, జీడి తోటలు, రబ్బరు తోటల పెంపకం, మిరియాల సాగులో రైతులు పొందుతున్న ఆదాయం, మార్కెటింగ్ సదుపాయాలు, గిట్టుబాటు ధరలపై సమీక్షించారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ ఏజెన్సీలో సుమారుగా 2 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలున్నాయని, వాటి ద్వారా 75 వేల టన్నుల కాఫీ పండ్ల దిగుబడులు వస్తున్నాయన్నారు. ఈ ఏడాది 2 వేల టన్నుల కాఫీ పండ్లు సేకరణ లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు కట్టా సింహాచలం, అపూర్వభరత్, జిల్లా ఉద్యాన వనాధికారి రమేశ్ కుమార్‌రావు, కాఫీ బోర్డు డీడీ రమేశ్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నంద్, స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బి.కల్యాణి, జీసీసీ డీఎంలు సింహాచలం, దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సన్నాహాలు

ఉత్తరాంధ్రలో 18 ప్రాజెక్టు, 26 డిస్ట్రిబ్యూటరీ, 1,416 నీటి సంఘాలు

ఎన్నికల ప్రక్రియ 16న ప్రారంభం

నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల పరిధిలో నీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించడంతో తగిన ఏర్పాట్లు చేస్తున్నామని జలవనరుల శాఖ నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు అన్నారు. బుధవారం జలవనరుల శాఖ సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ భారీ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గల వంశధార, తోటపల్లి, నారాయణపురం, తాండవ ప్రాజెక్టుల పరిధిలో 3.33 లక్షల ఆయకట్టుకు సంబంధించి ఆరు ప్రాజెక్టు కమిటీలు, 26 డిస్ట్రిబ్యూటరీ, 149 నీటి సంఘాలు ఉన్నాయన్నారు. మధ్య తరహా నీటి ప్రాజెక్టుల పరిధిలో గల 1.67 లక్షల ఎకరాలకు సంబంధించి 12 ప్రాజెక్టు కమిటీలు, 99 నీటి సంఘాలు, చిన్న నీటి నీరుదల శాఖ పరిధిలో గల 3.96 లక్షల ఎకరాలకు సంబంధించి 1,168 నీటి సంఘాలు ఉన్నాయన్నారు. మధ్యతరహా ప్రాజెక్టుల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ, చిన్న నీటి పారుదల శాఖలో ప్రాజెక్టు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండవన్నారు. మొత్తం 18 ప్రాజెక్టు, 26 డిస్ట్రిబ్యూటరీ, 1,416 నీటి సంఘాల పరిధిలో 8.97 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై నవంబరు 20వ తేదీతో ముగుస్తుందన్నారు. నీటి సంఘాలకు అసిస్టెంట్ ఇంజనీర్లు, డిస్ట్రిబ్యూటరీ సంఘాలకు డీఈఈ, ప్రాజెక్టు కమిటీలకు ఈఈ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. ఓటర్ల జాబితా త్వరలో ప్రకటిస్తామన్నారు. ఆయకట్టు కింద పది సెంట్లు భూమి ఉన్న రైతుకు ఓటు హక్కు ఉంటుందని పేర్కొన్నారు.

విశాఖకు ఐటీ బూస్ట్

- త్వరలో టీసీఎస్ కంపెనీ రాక
- 10 వేల మందికి ఉద్యోగాలు
- పరిశ్రమ వర్గాల్లో హర్షం
- పెద్ద కంపెనీలన్నీ వస్తాయని ఆశాభావం

TATA CONSULTANCY SERVICES

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖను ఐటీ డెస్టినేషన్‌గా మారుస్తామని హామీ ఇచ్చిన మంత్రి నారా లోకేశ్ తన మాటను తొలి 120 రోజుల్లోనే నిలబెట్టుకున్నారు. ప్రముఖ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)ను విశాఖ రప్పిస్తున్నారు. అందులో పది వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. టీసీఎస్ వస్తే ఆ తరువాత మరికొన్ని పెద్ద కంపెనీలు ఇక్కడకు వచ్చే అవకాశం ఉంది. ఇక చిన్న కంపెనీల సంగతి చెప్పాల్సిన అవసరం లేదు.

గత వైసీపీ హయాంలో విశాఖకు భారీ ఐటీ కంపెనీ ఒక్కటి కూడా రాలేదు. రుషికొండలో ఏర్పాటైన ఇన్ఫోసిస్ తన అవసరాల కోసం...విశాఖ అనువుగా ఉంటుందని కార్యాలయం ఏర్పాటుచేసింది. అందులో మొత్తం మూడు వేల మంది పనిచేస్తున్నారు. దీనిని వైసీపీ తన ఘనతగా ప్రచారం చేసుకుంది.

రుషికొండలో ఖాళీగా ఉన్న మిలీనియం టవర్స్‌ను అద్దెకు ఇవ్వాలని అనేక ఐటీ కంపెనీలు అడిగినా వైసీపీ నేతలు ఇవ్వలేదు. పరిపాలనా రాజధానికి భవనాలు కావాలంటూ ఐదేళ్లు ఖాళీగా ఉంచారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం విశాఖలో ఎక్కడ ఏది కావాలంటే అది సమకూరుస్తామని పెట్టుబడిదారులకు హామీ ఇవ్వడంతో ఎటువంటి టీసీఎస్ వంటి సంస్థలు ముందుకువస్తున్నాయి. దీంతో ఉత్తరాంధ్ర యువత ఉపాధి కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు వెళ్లాల్సిన అగత్యం తప్పనున్నది. ఇక్కడే మంచి కొలువులు లభించనున్నాయి.

మంత్రి లోకేశ్ కృషి అభినందనీయం

-ఓ.నరేశ్‌కుమార్, ఉపాధ్యక్షులు, రుషికొండ ఐటీ పార్కు అసోసియేషన్

ఐటీ శాఖా మంత్రి లోకేశ్ కృషిని ప్రశంసించాలి. పట్టు వదలకుండా పెట్టుబడిదారులను విశాఖపట్నం రప్పించేందుకు యత్నించి విజయం సాధించారు. ఇలాంటివి మరిన్ని రావాలని ఆకాంక్షిస్తున్నాం.

చిన్న కంపెనీలు క్యూ కడతాయి

-నారాయణ, వైస్ ప్రెసిడెంట్, డబ్ల్యుఎన్ఎస్

టీసీఎస్ వంటి పెద్ద ప్లేయర్లు విశాఖపట్నం వస్తే చిన్న కంపెనీలు ఇక్కడికి రావడానికి క్యూ కడతాయి. విశాఖలో స్పేస్ సమస్య కూడా లేదు. ఎక్కడికక్కడే అనువైన భవనాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో విశాఖలో ఐటీ అభివృద్ధి నిలిచిపోయింది. ఇప్పుడు మళ్లీ పునరుత్తేజం వచ్చింది.

ఒత్తిడితో చిత్తు!

- వృత్తిపరమైన, మానసిక సమస్యలతో సతమతమవుతున్న ఉద్యోగులు
- రాత్రిపూట ఉద్యోగాలు చేసే వారిలో మరింత అధికం
- సంస్థ లక్ష్యాలు, ఉన్నతాధికారుల వేధింపులు, వివక్ష కారణమే
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

-కథనం 5వ పేజీలో..

పండ్ల తోటలు సాగు చేసే రైతులకు చేయూత

జిల్లాలో 4,500 ఎకరాల్లో సాగు

ఏడు మాతోట, 25 ఎఫ్‌పీవోలకు ప్రోత్సాహకాలు

ప్రభుత్వశాఖలకు రూ.440 కోట్ల రుణాలు

నాబార్డు డీడీఎం ఆర్.చక్రధర్

6

చెట్టు.. భయపెట్టేటట్టు..

ఘాట్ రోడ్డులో ప్రమాదభరితంగా ఎండిన చెట్లు

- ఏ క్షణాన విరిగి మీద పడుతుందోనని వాహనచోదకుల బెంబేలు
- ఏడాది క్రితం లారీపై భారీ వృక్షం విరిగిపడడంతో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారుల వేడుకోలు





ములియగుడ సమీపంలో ఎండిన చెట్టు. (ఇన్‌సెట్లో) అరకు నుంచి మైదాన ప్రాంతానికి వెళుతున్న లారీపై చెట్టు విరిగిపడడంతో ధ్వంసమైన ముందు భాగం(ఫైల్ ఫొటో)

అనంతగిరి, అక్టోబరు 9: ఘాట్‌రోడ్డులోని ఎండిన చెట్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ చెట్టు కూలుతుందోనని బిక్కుబిక్కుమంటూ వాహనదారులు ప్రయాణాలు సాగిస్తున్నారు. వర్షాలు కురిసే సమయంలో మరింత భీతిల్లుతున్నారు. అనంతగిరి ఘాట్‌రోడ్డు శివలింగపురం నుంచి అరకు వరకు ప్రధాన రహదారిని ఆనుకుని చాలా వరకు ఎండిపోయిన చెట్లు దర్శనమిస్తున్నాయి. ఘాట్‌రోడ్డులో గత ఏడేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో పరిస్థితి దారుణంగా ఉంది. గతంలో ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో అరకు- విశాఖ ప్రధాన ఉండడంతో ఎప్పటికప్పుడు రక్షణ చర్యలు చేపట్టేవారు. ఈ రోడ్డును ఎన్‌హెచ్ఏఐకి బదలాయించడంతో నిర్వహణ బాధ్యతను గాలికి వదిలేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

తరచూ ప్రమాదాలు

అనంతగిరి పీహెచ్‌సీ సమీపంలో గత ఏడాది అరకు ... మిగతా 6వ పేజీలో

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

» పెనుగొల్లు వద్ద రోడ్డు దాటుతుండగా ఢీకొన్న మినీ బస్సు



అప్పారావు (ఫైల్)

ఎస్.రాయవరం, అక్టోబరు 9: మండలంలోని పెనుగొల్లు వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సోముదేవుపల్లి గ్రామానికి చెందిన భీమరాజు అప్పారావు(46) తన గ్రామం నుంచి పెనుగొల్లు గ్రామానికి వెళుతున్న క్రమంలో పెనుగొల్లు వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా తుని వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న మినీ బస్సు ఢీకొంది. దీంతో ఆయన తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు వ్యవసాయ కార్మికుడని స్థానికులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

25 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యంలోడుతో పట్టుకున్న లారీ

నక్కపల్లి, అక్టోబరు 9: మండలంలోని వెదుళ్లపాలెం హైవే జంక్షన్ వద్ద లారీలో అక్రమంగా రవాణా అవుతున్న 25 టన్నుల రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకుని కేసు నమోదు చేశామని సీఐ కుమారస్వామి చెప్పారు. కాకినాడ జిల్లా గొల్లపల్లి నుంచి నక్కపల్లి వైపు లారీలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు వెదుళ్లపాలెం హైవే జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. ఎటువంటి అనుమతుల్లేకుండా బియ్యాన్ని రవాణా చేస్తున్న లారీని పట్టుకుని కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

ఎలమంచిలిలో 850 కిలోలు...



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల గోదాముకు తరలించిన అధికారులు

ఎలమంచిలి, అక్టోబరు 9: మునిసిపాలిటీలోని కట్టుపాలెం సమీపంలో షెడ్డులో ఉంచిన 850 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని పౌరసరఫరాల డీటీ ఈశ్వరావు తెలిపారు. బుధవారం కట్టుపాలెం సమీపంలో నిల్వ ఉంచిన ఈ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ లక్ష్మీజీ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారని, ఈ బియ్యాన్ని లైనుకొత్తూరులోని పౌర సరఫరాల గోదాముకు తరలించి కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

50 కిలోల గంజాయి స్వాధీనం, నలుగురి అరెస్టు



గంజాయి నిందితులతో ఎస్ఐ, సిబ్బంది

కొయ్యూరు, అక్టోబరు 9: స్థానిక పోలీసులు బుధవారం సాయంత్రం కొయ్యూరు-శాకరపాడు మధ్య 50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కొయ్యూరు ఎస్ఐ నాగార్జున అందించిన సమాచారం మేరకు.. ఏజెన్సీ నుంచి గంజాయి రవాణా అవుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బుధవారం సాయంత్రం చీడిపాలెం కూడలి వద్ద వాహన తనిఖీ చేపట్టారు. ఆటోలో సోదాలు చేయగా మూడు బస్తాల్లో ప్యాకింగ్ చేసిన గంజాయి బయటపడింది. దీనికి సంబంధించి గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీకి చెందిన వంతల రాజబాబు, వంతల సుబ్బయ్య పాంగి సత్తిబాబు, కిల్లో లేసులను అరెస్టు చేశారు.

21 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



గంజాయి తరలిస్తూ పట్టుబడిన నిందితులు

దేవరాపల్లి, అక్టోబరు 9: ఒడిశా నుంచి అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల మీదుగా తరలిస్తున్న గంజాయిని మండలంలోని శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు. ఎస్.ఐ. టి.మల్లేశ్వరరావు వెల్లడించిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన బొడ్డపాటి తేజకిరణ్, పూలప కాశీ కిరణ్ దత్త సాయి, చెవ్వకుల రేణుక.. పెదబయలు మండలం జామిగుడ సమీపంలోని ఒడిశాలో 21 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. దీనిని కారులో కాకినాడ తరలించడానికి పినకోట మీదుగా దేవరాపల్లి వస్తున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు పోలీసులు శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద తనిఖీలు చేపట్టారు. కారును తనిఖీ చేయగా 21 కిలోల గంజాయి లభించింది. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బాలికపై అత్యాచారం.. డీఎస్పీ విచారణ



గ్రామంలో విచారణ జరుపుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ వేణుగోపాలరావు

హుకుంపేట అక్టోబరు 9: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను వీలైనంత త్వరగా అరెస్టు చేస్తామని ఇన్‌చార్జి డీఎస్పీ వేణుగోపాలరావు చెప్పారు. మండలంలోని దిగుడుపుట్టు గ్రామానికి చెందిన తన కుమార్తెపై, గూడ గ్రామానికి చెందిన కిల్లో చరణ్ అనే యువకుడు అత్యాచారం చేశాడని, ఇతనికి మరో ఇద్దరు సహకరించారని బాధితురాలి తండ్రి మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. దీంతో పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకోగా, నిందితులు పరారయ్యారని వెల్లడించారు. ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో బుధవారం ఉదయం గూడ గ్రామానికి వెళ్లి విచారణ జరిపానన్నారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించించామని, నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని పేర్కొన్నారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామని, నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని డీఎస్పీ చెప్పారు. ఆయన వెంట సీఐ నాయుడు, ఎస్ఐ సురేశ్ వున్నారు.

లారీ, ద్విచక్ర వాహనం ఢీ: ఒకరికి తీవ్రగాయాలు

ఎలమంచిలి, అక్టోబరు 9: మండలంలోని రేగుపాలెం వైజంక్షన్ వద్ద బుధవారం లారీ, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు అందాల్సి ఉందని రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

ఒత్తిడితో చిత్తు!





విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా మానసిక సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. తీవ్రమైన ఒత్తిడి దీనికి కారణమవుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలకు తోడుగా మానసిక ఆందోళనలు పెరగడం కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా అక్టోబరు పదో తేదీన ప్రత్యేక థీమ్‌తో మెంటల్ హెల్త్ డే (ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం) నిర్వహిస్తు న్నారు. ఈ ఏడాది పని ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యం పేరుతో జరపాలని నిర్ణయించారు.

వృత్తిపరమైన, మానసిక సమస్యలతో సతమతమవుతున్న ఉద్యోగులు

- సాఫ్ట్‌వేర్, పోలీసులు, జర్నలిస్టులు, ఆర్మీతోపాటు అనేక రంగాల వారిపై ప్రభావం
- రాత్రిపూట ఉద్యోగాలు చేసే వారిలో మరింత అధికం
- సంస్థ లక్ష్యాలు, ఉన్నతాధికారుల వేధింపులు, వివక్ష కారణమే
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

గతంతో పోలిస్తే పనిచేసే ప్రదేశంలో పెరుగుతున్న వేధింపులు, లక్ష్యాలు ఉద్యోగులను తీవ్ర ఒత్తిడికి గురిచేయడంతో పాటు మానసిక అనా రోగ్య సమస్యలకు దారితీస్తోందని వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ మెంటల్ హెల్త్ గుర్తించింది. ఈ విషయం సంస్థల యాజమాన్యాలకు తెలియజేయడం తో పాటు పని ప్రదేశాల్లో ఎదురయ్యే ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందే మార్గాలపై అవగాహన కల్పించేందుకు ఈ థీమ్‌ను ఎంపిక చేసుకున్నారు. 1992 నుంచి వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ ఆర్గనైజేషన్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మానసిక సమస్యలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

ఒత్తిడి.. ప్రధాన కారణం

మానసిక సమస్యలకు ప్రధాన కారణం ఒత్తిడి. పని ప్రదేశాల్లో ఎదురవుతున్న ఒత్తిడితో ఉద్యోగులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. సంస్థ లక్ష్యాలను చేరుకునే క్రమంలో ఉన్నతాధికారుల వేధింపులు, సరైన సహకారం లభించకపోవడం, వివక్ష, రాత్రిపూట విధులు నిర్వర్తించాల్సి రావడం తదితర అంశాలు ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తున్నాయి.

ఈ రంగాల్లోని ఉద్యోగులపై అధికం..


గతంతో పోలిస్తే అన్ని రంగాల్లోనూ ఒత్తిడి పెరిగింది. అయితే, కొన్ని రంగాల్లో పరిధికి మించిన ఒత్తిడితో చిన్న వయసులోనే మానసికంగా సమస్యల బారిన పడుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఈ జాబితాలో తొలి వరుసలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉన్నారు. వృత్తిపరమైన లక్ష్యాలతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొనడంతో పాటు బానిజం వంటివి ఉద్యోగులను ఒత్తిడికి గురిచేస్తున్నాయని చెబుతున్నారు. ఈ రంగంలో పురుషులతో పోలిస్తే మహిళలపై మరింత అధిక ఒత్తిడి ఉందంటున్నారు. వృత్తిపరమైన లక్ష్యాలు, రాత్రి వేళల్లో పనిచేయాల్సి రావడం, సరైన నిద్ర లేకపోవడం ఒత్తిడికి కారణమవుతోంది. ఆ తరువాత వరుసలో మార్కెటింగ్ రంగంలో పనిచేసే ఉద్యోగులున్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్, మార్కెటింగ్ ఆఫీసర్స్ లక్ష్యాలను చేరుకునే క్రమంలో సమస్యను ఎదుర్కొంటున్నారు. వీరితో పాటు విధి నిర్వహణలో పోలీసులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, కానిస్టేబుల్స్, ఎస్ఐ స్థాయిలో మానసిక సమస్యలు పెరుగుతున్నట్టు అనేక పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఆర్మీఉద్యోగులు, జర్నలిస్టులు, వివిధ ప్రైవేటు రంగాల్లో పనిచేసే ఉద్యోగులపైనా అధికఒత్తిడి పడుతోంది.

ఇబ్బందులు ఎన్నో..

ఉద్యోగులు తీవ్ర ఒత్తిడితో అనారోగ్యానికి గురవడంతో పాటు సంస్థకు నష్టాన్ని కలిగిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పని ప్రదేశం ఆహ్లాదకరంగా ఉంటే మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు వీలుంటుంది. ఒత్తిడితో కూడిన ఉద్యోగాలతో పని సామర్థ్యం తగ్గుతుందని చెబుతున్నారు. డిప్రెషన్, అనెగ్జైటీ కారణంగా ఏటా 12 బిలియన్ పని రోజులను నష్టపోవాల్సిన పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. వృత్తిపరమైన ఒత్తిళ్లు, ఇతర ఇబ్బందులతో ఎంతోమంది ఉద్యోగులు డిప్రెషన్, యాంగ్జైటీ, ఫోబియా, నిద్ర పట్టకపోవడం, నెగిటివ్ ఆలోచనలు వంటి మానసిక సమస్యల బారినపడుతున్నారు. కొందరిలో హార్మోన్ల అసమతుల్యత, థైరాయిడ్, పానిక్ కావడం వేధిస్తుంటాయని వివరించారు.

ఈ జాగ్రత్తలతో చెక్..

కొన్ని జాగ్రత్తలతో మానసిక సమస్యల బారిన పడకుండా ఉపశమనం పొందవచ్చు. ప్రతిరోజూ రాత్రి పూట విధులు నిర్వర్తించడం కాకుండా షిఫ్ట్‌లు మంచిది. అలవెన్సులు, ఇతర బెనిఫిట్స్ కోసం పరిధికి మించి పనిచేయడం మానుకోవాలి. రోజులో కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి. మంచి ఆహార అలవాట్లు, కనీసం గంటపాటు వ్యాయామం, మానసిక ప్రశాంతతను కలిగించే మ్యూజిక్ వినడం, యోగా, మెడిటేషన్ చేయాలి. వీటితోపాటు ప్రతిరోజూ తప్పనిసరిగా కుటుంబంతో కొంత సమయాన్ని గడపడం ముఖ్యం.



ఉద్యోగుల్లో పెరుగుతున్న సమస్యలు



గతంతో పోలిస్తే అనేక రంగాల్లో పనిచేసే ఉద్యోగుల్లో మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. ఉద్యోగి మాన సిక ఒత్తిడికి గురైతే సంస్థపై ప్రభావం పడుతుందని గుర్తించాలి. ఆహ్లాదకరమైన పని వాతావరణం ఉన్నచోటే మెరుగైన ఉత్పత్తి సాధ్యం. ఉద్యోగుల్లో సహకార భావం కూడా అవసరం. అనేక చోట్ల వృత్తిపరమైన వేధింపులు ఎదురవుతున్నాయి. దీనివల్ల తీవ్రమైన ఒత్తిడి పడుతుంది. మానసిక వైద్య నిపుణుల వద్దకు వస్తున్న వారిలో ఎక్కువమంది ఉద్యోగులే కావడం ఆందోళన కలిగిస్తోంది. దీనిని ఎదుర్కొనేందుకు స్ట్రెస్ రిలాక్సేషన్ టెక్నిక్స్‌ను పాటించాలి.

- డాక్టర్ కేవీ రామిరెడ్డి, మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్

'హౌసింగ్' చైర్మన్‌గా తాతయ్యబాబు నేడు ప్రమాణస్వీకారం



తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 9: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బత్తుల తాతయ్యబాబు గురువారం పదవీ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయన ఇప్పటికే ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కూటమి పార్టీల నాయకులను కలిసి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానించారు. కాగా బుచ్చెయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన తాతయ్యబాబు తెలుగుదేశం పార్టీతోనే రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. సామాన్య కార్యకర్త నుంచి అంచెలంచెలుగా ఎదిగి జిల్లా అధ్యక్షుని స్థాయికి చేరుకున్నారు. వడ్డాది మేజరు పంచాయతీ వార్డు మెంబరుగా, సర్పంచ్‌గా, బుచ్చెయ్యపేట ఎంపీపీగా పనిచేశారు. పార్టీ పరంగా చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. గత ఎన్నికల్లో చోడవరం నియోజకవర్గంలో టీడీపీకి భారీ మెజారిటీ రావడానికి తాతయ్యబాబు చేసిన కృషేనని భావించిన సీఎం చంద్రబాబునాయుడు.. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఆయనను నియమించారు.

నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 9: నిత్యావసర సరకుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ జాహ్నవి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిత్యావసర సరకుల ధరల నియంత్రణపై పౌరసరఫరాలు, మార్కెటింగ్, తూనికలు-కొలతల శాఖల అధికారులు, హోల్‌సేల్ వ్యాపారులు, షాపింగ్‌మాల్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉల్లిపాయలు, టమాటా, వంట నూనెలను ప్రత్యేక కౌంటర్ల ద్వారా రాయితీపై విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కృత్రిమ కొరత సృష్టించకుండా అధికారుల కమిటీ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సరకుల నిల్వ, అమ్మకాలపై రోజువారీ నివేదిక అందించాలని తూనికలు, కొలతల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక కౌంటర్లలో సరకులు విక్రయించేందుకు హోల్‌సేల్ మార్కెట్‌లో సమాచారాన్ని సేకరించి ధరలను నిర్ణయించాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మూర్తి, జిల్లా మేనేజర్ జయంతి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక కౌంటర్లలో విక్రయాలు

నిత్యావసర సరకుల ధరల నియంత్రణ చర్యల్లో భాగంగా గురువారం నుంచి అనకాపల్లిలో ఎన్టీఆర్ మార్కెట్ యార్డు, నర్సీపట్నం, ఎలమంచిలిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సబ్సిడీ ధరలకు ఉల్లిపాయలు, టమాటా, వంటనూనెలు విక్రయిస్తామని జేసీ జాహ్నవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉల్లిపాయలు కిలో రూ.60, టమాటా కిలో రూ.52, పామాయిల్ లీటరు రూ.117, ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ.126, వేరుశనగనూనె లీటరు రూ.155ల చొప్పున విక్రయించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మోర్, రిలయన్స్, డీమార్ట్, విశాల్ ఔట్‌లెట్‌ల్లో కూడా ఇవే ధరలకు సరకులు లభిస్తాయన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

నేత్రపర్వంగా గరుడ సేవ

» సంప్రోక్షణ జలాలతో భక్తుల పులకింత



ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



గరుడ వాహనంపై శ్రీవారు

నక్కపల్లి, అక్టోబరు 9: మండలంలోని ఉపమాక క్షేత్రంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నేత్రపర్వంగా స్వామివారి గరుడ సేవ, వసంతోత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామివారికి అర్చకుల బృందం విశేష పూజలు చేసింది. సాయంత్రం ఆస్థాన మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, బ్రహ్మ సహిత సప్త రుషుల ఆవాహనం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ఇత్తడి గరుడ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని పట్టుపీతాంబరాలతో అలంకరించారు. రాత్రి 8 గంటల వరకూ మాడవీధుల్లో స్వామివారి తిరువీధి సేవలో వసంతోత్సవం కన్నుల పండువగా జరిగింది. ముందుగా అర్చకులు.. వేదపండితులు, ఆలయ సిబ్బందిపై వసంత జలాలను సంప్రోక్షణ చేసి భక్తులపై జల్లారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, నందూరి రాజగోపాలాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, రిటైర్డ్ ఈవో రంగనాథస్వామి, శ్రీవారి సేవా సంఘం ప్రతినిధులు యూవీఎస్ రావు, రంగబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, అక్టోబరు 9: దసరా నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేస్తున్నామని వాల్తేరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కోరాపుట్-విశాఖ (08546/08545) ప్రత్యేక పాసింజర్ రైళ్లకు ఈ నెల 17 వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్, విశాఖ-భవానీపాట్నా-విశాఖ (08504/08503) ప్రత్యేక రైళ్లకు ఈ నెల 10 నుంచి 18 వరకు రెండు జనరల్ సెకండ్ క్లాసు కోచ్‌లు, విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ (08532/08531) ప్రత్యేక రైళ్లకు ఈ నెల 9 నుంచి 17 వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ క్లాస్ కోచ్, విశాఖ-రాయపూర్-విశాఖ (08528/08527) ప్రత్యేక పాసింజర్ రైళ్లకు ఈ నెల 11 నుంచి 18 వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ క్లాసు కోచ్ జత చేస్తున్నట్టు పేర్కొన్నారు.

శ్రీకాకుళం-విజయవాడ ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

దువ్వాడ మీదుగా శ్రీకాకుళం రోడ్డు-విజయవాడ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను ఈ నెల 17 వరకు కొనసాగిస్తామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07215 నంబరు గల రైలు ఈ నెల 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో రాత్రి 8.00 గంటలకు విజయవాడలో బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 1.28 గంటలకు దువ్వాడ, 5.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07216 నంబరు గల రైలు ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17 తేదీల్లో ఉదయం 6.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి 9.30 గంటలకు దువ్వాడ, సాయంత్రం 4.00 గంటలకు విజయవాడ చేరుతుంది. ఈ సర్వీసులు ఒక థర్డ్ ఏసీ, ఐదు స్లీపర్, 14 జనరల్ సెకండ్‌క్లాసు కోచ్‌లతో రాకపోకలు సాగిస్తాయన్నారు.

బ్రిక్స్ పరిశ్రమ ప్రమాదంలో మరొకరి మృతి




లోక్‌నాథ్ మౌళి(ఫైల్)

ఎలమంచిలి, అక్టోబరు 9: మండలంలోని మత్రిబంద జాతీయ రహదారి పక్కన ఉన్న ఫ్యూజన్ బ్రిక్స్ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన మరో కార్మికుడు బుధవారం మృతి చెందాడు. ఈ నెల 5న బ్రిక్స్ పరిశ్రమ ఆవరణలో గ్యాస్ సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం జరగడంతో ఒకరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన లోక్‌నాథ్ మౌళి(44) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. దీంతో మృతుల సంఖ్య రెండుకు చేరింది. మౌళి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో ఉంచినట్టు ఎస్ఐ తెలిపారు.

అందరికీ సూపర్ హీరో నాన్నే

» హీరో సుధీర్‌బాబు



మాట్లాడుతున్న సుధీర్‌బాబు

విశాఖపట్నం, అక్టోబరు 9 : అందరికీ సూపర్ హీరో నాన్నే అని సినీ హీరో సుధీర్ బాబు అన్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సీఏఎం ఎంటర్టైన్‌మెంట్, వీ సెల్యూలాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు నిర్మించిన మా నాన్న సూపర్ హీరో సినిమా యూనిట్ బుధవారం గాదిరాజు ప్యాలెస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా అక్టోబరు 1న విడుదల అవుతోందని, తండ్రీ కొడుకుల ఎమోషన్ అద్భుతంగా ఉంటుందని తెలిపారు. ఇద్దరు తండ్రులు, ఒక కొడుకు చుట్టూ తిరిగే ట్రయాంగిల్ లవ్ స్టోరీ అన్నారు. మానవ సంబంధాలపై సన్నివేశాలు ఆకట్టుకుంటాయని చెప్పారు.

గంజాయి రవాణాపై కఠిన చర్యలు

» రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



మాట్లాడుతున్న డీఐజీ

విశాఖపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టాలని రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశించారు. రేంజ్ పరిధిలోని జిల్లాల ఎస్పీలతో గురువారం ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలో గంజాయి సాగు చేయకుండా చూడాలని, రవాణా, విక్రయాలు, వినియోగం వల్ల వచ్చే ఇబ్బందులను రైతులకు వివరించాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం ద్వారా వచ్చే అనర్థాలను విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు సంకల్పం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గంజాయి రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలన్నారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న నిందితుల అరెస్టుకు ప్రత్యేక బృందాలను నియమించాలి ఆదేశించారు. సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930కు ఫిర్యాదు చేసేలా అవగామన కల్పించాలన్నారు. ఎస్పీలు ఎం.దీపిక, అమిత్ బర్ధర్, వకుల్‌జిందల్, కేవీ.మహేశ్వరరెడ్డి, ఎస్‌వీ.మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో టోర్నీలో ఇద్దరికి బంగారు పతకాలు



మోహిత్, సుస్మిత

ఎలమంచిలి, అక్టోబరు 9: తిరుపతిలో ఈ నెల 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్- 17 తైక్వాండో టోర్నీలో ఎలమంచిలికి చెందిన నగిరెడ్డి మోహిత్, పోలవరపు సుస్మిత బంగారు పతకాలు సాధించినట్టు తైక్వాండో ఫౌండర్ కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. బుధవారం వీరిని క్రీడాకారుడు దొరబాబు, వ్యాపార వేత్త బుజ్జి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొఠారు నరేశ్ అభినందించారు.

నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి సహకరిస్తాం

» సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



మాట్లాడుతున్న సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, అక్టోబరు 9: సింహాద్రి ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా స్పష్టం చేశారు. సంస్థ అడ్మిన్ కార్యాలయంలో బుధవారం నిర్వాసిత గ్రామాల సర్పంచులు, మండల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్య, వైద్యం, తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. గ్రామాలకు ఏయే అవసరాలు ఉన్నాయి?, ఏ పనులు చేపట్టాలో తదితర వివరాలను సీజీఎం అడిగి తెలుసుకున్నారు. నిర్వాసిత గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి వివిధ విభాగాల అధికారులు ప్రశాంత్‌కుమార్ జెనా, పద్మప్రియ, శ్రీమంతా మహాపాత్ర, టీటీ పాత్ర, కె. ప్రకాశరావు, శివం ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రమణయ్యపేటలో కేంద్ర కమిటీ పర్యటన

» కేంద్ర పథకాల అమలుపై డ్వాకా సంఘాల సభ్యులతో సమావేశం

నక్కపల్లి, అక్టోబరు 9: మండలంలోని రమణయ్యపేట గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు కేంద్ర కమిటీ బృందం పర్యటించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖలకు చెందిన అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోర్కర్‌లతో కూడిన బృందం బుధవారం రమణయ్యపేట పంచాయతీని తనిఖీ చేసింది. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ గ్రామంలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఎంతమంది ఏ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారో కేంద్ర కమిటీ ప్రతినిధులు ఆరా తీశారు. ఈ గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారితో మాట్లాడారు. వారికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. వారి వెంట ఎంపీడీవో సీతారామరాజు, పలువురు అధికారులు ఉన్నారు.

వివిధ రూపాల్లో అలరిస్తున్న అమ్మవారు



ఎలమంచిలి, అక్టోబరు 9: పట్టణంలోని జలాలు వీధిలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమ ఆకట్టుకుంటున్నది. అమ్మవారు వివిధ రూపాల్లో ఉన్న ప్రతిమను మండపంలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు.

జలాలు వీధిలో పలు రూపాల్లో దర్శనమిస్తున్న దుర్గామాత

నేడు తపాలా కార్యాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరం

పాడేరు రూరల్, అక్టోబరు 9: పాడేరు డివిజనల్ తపాలా కార్యాలయంలో గురువారం ఆధార్ ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్టు పోస్టల్ శాఖ సబ్ డివిజనల్ ఇనస్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. పోస్టల్ శాఖ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 12వ తేదీ వరకు ఆధార్, సేవింగ్, బీమా సేవలు అందిచనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాని ఆయన కోరారు. శిబిరానికి హాజరయ్యే వినియోగదారులు ఆధార్, పాన్ కార్డులు, మూడు పాస్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు.

కేజీబీవీల్లో నాన్ టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి, అక్టోబరు 9: కేజీబీవీల్లో నాన్ టీచింగ్ ఉద్యోగాలకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో పనసల ప్రసాద్ తెలిపారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, డేనైట్ వాచ్ ఉమన్, స్కావెంజర్, స్వీపర్ ఉద్యోగాల భర్తీకి సమగ్ర శిక్ష అధికారులు ప్రకటన జారీ చేశారన్నారు. డే నైట్ వాచ్‌ఉమన్‌కి ఏడో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. అసక్తి గల వారు ఈ నెల 15లోగా దరఖాస్తులు అందించాలని సూచించారు.

పండ్ల తోటల సాగు రైతులకు చేయూత

- జిల్లాలో 4,500 ఎకరాల్లో సాగు: నాబార్డు డీడీఎం చక్రధర్
- ఏడు మాతోట, 25 ఎఫ్‌పీవోలకు ప్రోత్సాహకాలు
- ప్రభుత్వ శాఖలకు రూ.440 కోట్ల రుణాలు

చింతపల్లి, అక్టోబరు 9: జిల్లా వ్యాప్తంగా 4,500 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసే రైతులకు నాబార్డు ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తుందని జిల్లా అభివృద్ధి మేనేజర్ (డీడీఎం) ఆర్. చక్రధర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నాబార్డు, పంచాయతీ నిధులతో నిర్మించిన సంత షెడ్ల వినియోగాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాబార్డు జిల్లాలో ఏడు మాతోటలు, 25 రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నదన్నారు. ఏడు మాతోట పరిధిలో 4,500 మంది ఒక్కొక్క ఎకరం చొప్పున పండ్ల తోటలు, అంతర పంటలను సాగు చేసుకుంటున్నారన్నారు. ఒక్కొక్క మాతోటకు రూ.3 కోట్లు నిధులు కేటాయించామన్నారు. పండ్ల తోటల వల్ల ఆదివాసీ రైతులు వ్యవసాయంలో ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది జిల్లాలో పలు ప్రభుత్వశాఖల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.440 కోట్ల రుణాలు అందజేశామన్నారు. వారపు సంతల్లో హట్ బజార్ (సంత షెడ్లు) నిర్మిస్తున్నామన్నారు. చింతపల్లి, పెదవలసలో హట్ బజార్లు నిర్మించామని తెలిపారు. పంచాయతీ, మండల పరిషత్ అధికారుల విజ్ఞప్తి మేరకు చింతపల్లి వారపు సంతలో షెడ్లు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజవొమ్మంగిలో నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు.



వారపు సంతను పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం చక్రధర్

నిధులు విడుదలకాగానే హట్ బజార్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఆదివాసీలకు ఫైనాన్స్, డిజిటల్ లిటరసీపై 500 అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. విశాఖ, కాకినాడ డీసీసీబీ, లీడ్ బ్యాంక్ యూబీఐ, ఎస్‌బీఐ అధికారులతో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీ శారద, సర్పంచ్ దురియా పుష్పలత, మాతోట సీఈవో ఎస్.సత్యనారాయణ ఉన్నారు.

కొండగోకిరి డిజిటల్ అసిస్టెంట్ విధులకు డుమ్మా

కొయ్యూరు, అకోబరు 9: మండలంలోని కొండగోకిరి గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఉమేష్ కొన్ని నెలలుగా విధులకు డుమ్మా కొడుతున్నారు. ఏ విధమైన సెలవు పెట్టకుండా సచివాలయానికి హాజరుకావడం లేదు. దీంతో సచివాలయ పరిధిలోని ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై సచివాలయ కార్యదర్శి ధనలక్ష్మిని సంప్రదించగా తొమ్మిది నెలల క్రితం మెడికల్ లీవ్‌కు దరఖాస్తు చేశారని, మంజూరు చేసే అధికారం తనకు లేకపోవడంతో ఎంపీడీవోకు పంపానని చెప్పారు. అనంతరం అతను కాంటాక్టులో లేరన్నారు. ఎంపీడీవో మేరీరోస్‌ను వివరణ కోరగా, డిజిటల్ అసిస్టెంట్ ఉమేష్ ఎందుకు విధులకు హాజరుకావడం లేదనే విషయం తమకు తెలియదని, విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపామని చెప్పారు. న్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎం.మాకవరం, మంప డిజిటల్ అసిస్టెంట్‌లకు రొటేషన్ పద్ధతిలో పనిచేయిస్తున్నామని చెప్పారు.

చిన్నారి మృతిపై సబ్ కలెక్టర్ విచారణ

సీలేరు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందికి మూడు గంటల పాటు ప్రశ్నలు

సీలేరు, అక్టోబరు 9: సీలేరు పీహెచ్‌సీలో రెండు నెలల చిన్నారి మృతిపై సబ్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్ బుధవారం విచారణ నిర్వహించారు. దుప్పులవాడ పంచాయతీ వలసగెడ్డ కాలనీకి చెందిన తాంబులు సోమర, పౌర్ణిమ దంపతుల రెండు నెలల చిన్నారికి దగ్గు, ఆయాసం, జ్వరంతో నాలుగు రోజుల క్రితం సీలేరు ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు అందుబాటులో లేరు. స్టాఫ్‌నర్సు దేవి పాపకు కనీసం చికిత్స చేయకుండా చింతపల్లి లేదా చింతూరు తీసుకువెళ్లాలని సూచించారు. దీంతో తల్లిదండ్రులు కొంతసేపు వేచి చూసి చిన్నారిని స్వగ్రామానికి తీసుకువెళ్లిపోయారు. అదే రాత్రి చిన్నారి అస్వస్థతకు గురికావడంతో ఆశ కార్యకర్త జెన్‌కో సీఎస్ఆర్ అంబులెన్సులో తిరిగి సీలేరు పీహెచ్‌సీకి తరలించారు. ఆ సమయంలోనూ వైద్యులు లేకపోవడంతో సిబ్బంది చింతూరు ఆసుపత్రికి రిఫర్ చేశారు. సీలేరు నుంచి అంబులెన్సు బయలుదేరిన కొద్ది సేపటికే చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటనపై సోమవారం పాప తల్లిదండ్రులు, గ్రామస్థులు సీలేరు వచ్చి వైద్యాధికారి మస్తాన్‌వల్లీని నిలదీశారు. ఈ అంశంపై పత్రికల్లో కథనాలు రావడంతో కలెక్టర్ దినేశ్‌కుమార్ స్పందించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి నివేదికను అందించాలని సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం సీలేరు పీహెచ్‌సీలో మూడు గంటలకుపైగా ఆయన గోప్యంగా విచారణ నిర్వహించారు. వైద్యులు మస్తాన్‌వల్లీ, సౌమ్యలను పలు అంశాలపై ప్రశ్నించారు. అనంతరం ఆ రోజు విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు దేవి, ఎంఎన్‌ఓ రాజారావు, అంబులెన్సు డ్రైవర్ జీవన్‌తో పాటు బాధిత తల్లిదండ్రులు సోమర, పౌర్ణిమ, దుప్పులవాడ సర్పంచ్, పలువురి నాయకులతో మాట్లాడి వైద్యుల పనితీరును తెలుసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్ అందిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతంలో చిన్న పిల్లలకు వైద్య సేవలు సకాలంలో అందక మృతి చెందుతున్నట్టు ఈ సందర్భంగా కూటమి నాయకులు వాపోయారు. ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్య నిపుణుడిని నియమించాలని కోరారు.



విచారణ కోసం సీలేరు వచ్చిన సబ్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్

డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

అరకులోయ, అక్టోబరు 9: మండల కేంద్రంలోని వాలీబాల్ గ్రౌండ్‌లో డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ ఉషారాణి, జడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోష్నీ, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు ఈ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా కారులు రాగాద్వేషాలకు అతీతంగా క్రీడా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. ఓల్డ్ స్టూడెంట్ స్పోర్ట్సు, కల్చరల్ అసోసియేషన్, పోటీల ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బురిడి ఆనందరావు, పోలు మాట్లాడుతూ టోర్నమెంట్‌ను గత వాలీబాల్ టీం సభ్యుల స్మారకార్థం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మైదానంలో తాగునీటి సౌకర్యార్థం జడ్పీటీసీ రోష్నీ తన నిధుల నుంచి బోరుబావిని ఏర్పాటు చేశారన్నారు. టోర్నమెంట్‌లో 36 జట్లు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకులోయ, అనంతగిరి ఎంఈవోలు త్రినాధరావు, బాలాజీ, పీడీలు కె.రాజు, లక్ష్మణ్, లైకోన్, బాలన్న, బాలి, మధుసూదనరావు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలలో తలపడుతున్న ఇరు జట్ల క్రీడాకారులు

హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ

చింతపల్లి, అక్టోబరు 9: హక్కులు, రక్షణ చట్టాలపై ఆదివాసీ మహిళలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని విశాఖపట్నం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు (విధాన్ సే సమాధాన్) జరిగింది. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు గృహ హింస, బాల్య వివాహాల నిరోధక, పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలకు పనిచేసే ప్రాంతంలో లైంగిక వేధింపులు, సామాజిక బహిష్కరణ చేపడితే న్యాయం పొందవచ్చునన్నారు. మహిళలకు సామాజికంగా ఎటువంటి ఇబ్బంది కలిగినా ఐసీడీఎస్, పోలీసు, గ్రామ స్థాయిలో మహిళా కానిస్టేబుళ్లను ఆశ్రయించవచ్చునని సూచించారు. హక్కులు, చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉంటే కొంత వరకు మోసపోకుండా ఉంటారన్నారు. అలాగే మండల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను ఆశ్రయించి మహిళలు ఉచితంగా న్యాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఏడీఎంహెచ్‌వో జమాల్ బాషా, డీపీవో కొండలరావు, డీఈవో బ్రహ్మాజీరావు, టీడబ్ల్యూ డీడీ రజిని, సీఐ కె.రమేశ్, ఎంపీడీవో శ్రీనివాసరావు, సీడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, ఎంఈవో ప్రసాద్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకట శేషమ్మ

మద్యం దుకాణాలకు మహా గిరాకీ

... 3వ పేజీ తరువాయి

మారుమూల ప్రాంతం ముంచంగిపుట్టులో ఒక మద్యం దుకాణానికి 28 దరఖాస్తులు అందాయి. వాస్తవానికి ఒడిశాను అనుకుని ఉన్న ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, డుంబ్రిగుడ ప్రాంతాల్లో నాటుసారా ప్రభావం అధికంగా ఉంటుంది. దీంతో అక్కడ మద్యం దుకాణాలకు పెద్దగా డిమాండ్ ఉండదని అందరూ భావించారు. కానీ అందుకు భిన్నంగా ఒక్క షాపు ఉండే ముంచంగిపుట్టులో 28, డుంబ్రిగుడలో 11, అనంతగిరిలో 20 దరఖాస్తులు వచ్చాయి. మరో విశేషం ఏమిటంటే రెండేసి దుకాణాలుండే జి.మాడుగులలో 2, పెదబయలులో 3 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

పాడేరు, అరకులోయ, చింతపల్లిలోనూ పోటా పోటీ

జిల్లాలో చింతూరు ఎక్సైజ్ స్టేషన్ తరువాత పాడేరు, అరకులోయ, చింతపల్లి స్టేషన్ల పరిధిలోనూ వైన్‌షాప్‌లకు పోటాపోటీగానే దరఖాస్తులు అందుతున్నాయి. పాడేరు స్టేషన్ పరిధిలో 5 మండలాల్లోని 10 షాప్‌లకు 120 దరఖాస్తులు రాగా, వాటిలో జిల్లా కేంద్రం పాడేరులోని 4 షాప్‌లకే 55 దరఖాస్తులు వచ్చాయి. అరకులోయలోని 4 దుకాణాలకు 55 దరఖాస్తులు చేయగా, చింతపల్లిలోని 3 దుకాణాలకు 36 దరఖాస్తులు చేశారు. రంపచోడవరం స్టేషన్ పరిధిలోని 7 మండలాల్లోని 10 దుకాణాలకు 120 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఎక్కడైనా మద్యం దుకాణాలను దక్కించుకునే క్రమంలో సిండికేట్లు కుమ్మక్కు కావడం చూస్తుంటాం. కానీ జిల్లాలో అందుకు భిన్నంగా సిండికేట్లు పోటాపోటీగా దరఖాస్తులు చేయిస్తుండడం విశేషం. అందువల్లే ఇతర ప్రాంతాలతో పోలిస్తే జిల్లాలో అధికంగా దరఖాస్తులు వచ్చాయని స్పష్టమవుతున్నది.

చెట్టు.. భయపెట్టేటట్టు..

... 3వ పేజీ తరువాయి

వైపు నుంచి మైదాన ప్రాంతానికి వెళుతున్న లారీపై చెట్టు విరిగిపడడంతో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు అయ్యి డ్రైవర్, క్లీనర్ గాయాలపాలయ్యారు. చెట్టు విరిగిపడిన ధాటికి రక్షణ గోడను ఢీకొట్టి లారీ నిలిచిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అలాగే రెండు నెలల క్రితం సుంకరమెట్ట సమీపంలో కారుపై చెట్టు విరిగిపడడంతో కారు ధ్వంసమైంది. అందులోని ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. తరచూ ఘాట్ రోడ్డులో ఎండిన చెట్లు విరిగిపడి ప్రమాదాలు సంభవిస్తుండడంతో వాహన చోదకులు భయపడుతున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందించి శివలింగపురం నుంచి అరకు వరకు ప్రధాన రహదారిని ఆనుకుని కూలేందుకు సిద్ధంగా ఎండిన చెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ సదస్సులో 21 ఫిర్యాదులు

పాడేరు రూరల్, అక్టోబరు 9: విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సదస్సులో వినియోగదారుల నుంచి సమస్యలపై 21 ఫిర్యాదులు అందాయని ఏపీఈపీడీసీఎల్ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీఎస్ఎం.అప్పారావు తెలిపారు. బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ రిటైర్డ్ జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించే ఈ సదస్సులో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం తదితర సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సాంకేతికి సభ్యులు ఎస్.మసిల్మన్, ఆర్.సురేంద్ర కుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలి

పాడేరు రూరల్, అక్టోబరు 9: మారుమూల గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నీటి కాలుష్యం కారణంగా జ్వరాలు, వ్యాధులు ప్రజలను పట్టిపీడిస్తున్నాయన్నారు. జిల్లా ఆస్పత్రిలో స్కానింగ్ పరికరాలు పనిచేయక రోగులు ప్రైవేటుగా స్కానింగ్ చేయించుకొనేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. అతని వెంట నాయకులు రాధాకృష్ణ, సింహాచలం, రాజు, రాంబాబు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పంట నష్టం అందించి ఆదుకోరూ..

- ఆకులూరు రైతుల వేడుకోలు

సీలేరు, అక్టోబరు 9: నెల రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు ప్రభుత్వ పరిహారం ఇంతవరకు అందలేదని గాలికొండ పంచాయతీ పరిధిలోని ఆకులూరు గ్రామానికి చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం తుఫాన్‌కు పంటలన్నీ దెబ్బతిన్నాయన్నారు. కనీసం అధికారులు వచ్చి పరిశీలించలేదని వాపోతున్నారు. అలాగే, కొండచరియలు విరిగిపడి రహదారి ధ్వంసం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గ్రామంలో 13 గడపలు ఉన్నాయని, తమ గ్రామం పూర్తిగా పీవీటీజీ గ్రామమైనా, తాగునీటి సౌకర్యం గానీ, పిల్లలు చదువు కోవడానికి పక్కా పాఠశాల భవనం కానీ లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పింఛన్లను లబ్ధిదారులు నాలుగు కిలోమీటర్ల దూరం నడచి తీసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీఓ స్పందించి సమస్యలపై చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

గిరి యువతకు క్వారీలు కేటాయించాలి

డుంబ్రిగుడ, అక్టోబరు 9: అల్లూరి జిల్లాలోని క్వారీలను గిరిజన యువతకు కేటాయించి అభివృద్ధికి బాటలు వేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు కోరారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పల్లె పండగను ప్రభుత్వం ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా 100 రోజుల్లో అభివృద్ధి పనులు జరిగేలా ప్రణాళిక రూపొందించడం అభినందనీయమన్నారు. మండలాల్లో క్వారీలు లేవని, అభివృద్ధి పనులకు మైదాన ప్రాంతం నుంచి నిర్మాణ సామగ్రి తీసుకు వస్తున్నారని చెప్పారు. దీంతో మన్యంలో అనేక అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోతున్నాయన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి క్వారీలను కేటాయించడంలో త్వరగతిన పనులు పూర్తయ్యాయన్నారు. ఈ విషయం గనుల శాఖ మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

కాఫీ సాగుపై దృష్టిసారించండి: ఏవో

ముంచంగిపుట్టు, అక్టోబరు 9: కాఫీ, మిరియాల పంటల సాగుపై రైతులు ప్రత్యేక దృష్టిసారించాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసబాబు సూచించారు. జర్జుల, జోలాపుట్టు పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడులు వచ్చేందుకు భూసార పరిరక్షణ చేస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అలాగే మిరియాల తోటల పెంపకం, వాటి లాభదాయకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాఫీ లైజన్ వర్కర్ గణేశ్వర రావు, గ్రామ ఉద్యాన సహాయకుడు సూర్యప్రకాశ్, పశు వైద్య సహాయకుడు బుచ్చిబాబు, రైతులు పాల్గొన్నారు.

'జిల్లా కేంద్రం తరలిస్తే ఊరుకోం'

డుంబ్రిగుడ, అక్టోబరు 9: అల్లూరి జిల్లా కేంద్రాన్ని నర్సీపట్నానికి తరలించేందుకు ప్రభుత్వం పూనుకుంటే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే ఫాల్గుణ చెప్పారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా కేంద్రాన్ని మైదాన ప్రాంతంలోని నర్సీపట్నంలో తరలిస్తారనే ఊహాగానాలు అధికమయ్యాయని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా గిరిజనులు అభివృద్ధికి దూరంగానే ఉన్నారని గుర్తుచేశారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం నిజం కాకుండా ప్రభుత్వం చూడాలని ఆయన కోరారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ

పాడేరు రూరల్, అక్టోబరు 9: మెయిన్ బజారులో బుధవారం దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ముందుగా అమ్మవారి విగ్రహాన్ని, భక్తులు సమర్పించిన సారెతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి మహిళలు వివిధ రకాల స్వీట్‌లను సారెగా సమర్పించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీఎంపీ సత్యనారాయణ, వై.శ్రీనివాస్, కమిటీ ప్రతినిధులు జి.శివకుమార్, కె.రామునాయుడు, ఎండీ తాజుద్దీన్, పి.వెంకట్, బి.రామునాయుడు, రవీంద్ర, వి.పిన్నయ్యదొర, పి.బుజ్జి, ఎస్.నాగేశ్వరరావు, పి.గోపి, బి.కృష్ణారావు, బి.నాగేశ్వరరావు, ఆర్.శంకరరావు, కె.ప్రతాప్, బి.కొండబాబు, ఐ.చంటి, ఎస్.చిట్టిబాబు, ఎ.గణేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పీటీడీ కాంప్లెక్స్ సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రొబ్బి రాము, ఉత్సవ కమిటీ ప్రతినిధులు నాగరాజు, నాగు, బుజ్జి, రెమో శ్రీను, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, టీడీపీ నాయకులు కొట్టగుళ్లి సుబ్బారావు, వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు ఉషారాణి పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకరణలో దుర్గమ్మ

సీలేరు: సీలేరు, ధారకొండల్లో బుధవారం మూలా నక్షత్రం కావడంతో దుర్గాదేవిని సర్వతీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బరోడా బ్యాంకు ఏటీఎం మూత



హుకుంపేట, అక్టోబరు 9: మండల కేంద్రంలో బరోడా బ్యాంకు ఏటీఎం మూతబడింది. ఏటీఎం రోజూ మూతబడి ఉండడంతో డబ్బు విత్‌డ్రాకు సమస్యలు నెలకొంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర ఖాతాదారులు ఏటీఎంకు వచ్చి నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎం సక్రమంగా పనిచేసేలా చూడాలని కోరుతున్నారు.

పిల్లలను పనిలో పెడితే చర్యలు

పాడేరు రూరల్, అక్టోబరు 9: పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని కార్మిక సహాయక అధికారి పి.సూర్యనారాయణ హెచ్చరించారు. పట్టణంలోని హోటళ్లు, వస్త్ర, కిరాణా దుకాణాల్లో బుధవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాణిజ్య సముదాయాలలో 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెడితే యజమానిపై కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 9: శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో మధుసూదనరావు అన్నారు. మొండిగెడ్డ గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తున్నది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ నూతన పద్ధతులు పాటించాలన్నారు. వరి, రాగి పంటలను వరుసల పద్ధతిలో నాట్లు వేసుకోవాలన్నారు. సేంద్రియ పద్ధతిలోనే పంటలను సాగు చేసుకోవాలని ఆయన సూచించారు.